క్లుప్తంగా

ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

కడప రూరల్ : ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన సూపర్ సిక్స్ డిమాండ్స్ అమలు చేయాలని ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కంభం చిన్నయ్య తెలిపారు. అందులో భాగంగా పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించాలని పేర్కొన్నారు. అలాగే ఐఆర్‌ను ప్రకటించడంతోపాటు ఉద్యోగులకు బకాయిపడ్డ నాలుగు డీఏలు మంజూరు చేయాలన్నారు. ఉద్యోగులు దరఖాస్తు చేసిన పీఎఫ్, మెడికల్ బిల్స్ తదితర ఆర్థిక బకాయిలను మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఈహెచ్‌ఎస్ కార్డు ద్వారా అన్ని రకాల హాస్పిటల్స్‌లలో ఉచిత వైద్యం లభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

జీఎస్టీ విధానంలోని మార్పులపై అవగాహన

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : మధ్యతరగతి ప్రజలకు లబ్ధి చేకూరేలా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ విధానంలో కొత్తగా తెచ్చిన మార్పుల గురించి లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రమేష్ కుమార్ రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. శనివారం స్థానిక రిలయన్స్ స్మార్ట్ బజార్లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏ వస్తువు మీద కొత్త విధానంలో ఏ మేరకు ధరను లెక్కించాలి తదతర అంశాలను వివరించారు. జీఎస్టీ కారణంగా ఫలితాలు ప్రజలకు చేరుతున్నాయా అని పరిశీలించారు. ఈ విషయంగా నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిలయన్స్ స్మార్ట్ బజార్ సిబ్బంది, కొనుగోలు దారులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు అవార్డులు

కడప ఎడ్యుకేషన్ : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని కడప జిల్లా అపుస్మా ఆధ్వర్యంలో అక్టోబర్ 5వ తేదీ ఉదయం 9 గంటలకు కడప జిల్లాలోని 110 మంది ప్రయివేట్ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వనున్నట్లు అపుస్మా జిల్లా అధ్యక్షులు బి. గంగయ్య, సెక్రటరీ శివశంకర్ రెడ్డిలు ఒక ప్రకటనలో తెలియజేశారు. కడపలోని జిల్లా పరిషత్ కాన్ఫరెన్స్ హాలులో ఈ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.

వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దేవుని కడప దగ్గరలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పుల్లయ్య అనే వ్యక్తిని శనివారం అరెస్టు చేశారు. అతని వద్దనుండి 32 క్వార్టర్ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అతన్ని కోర్టులో మెజిస్ట్రేట్ ముందు హాజరు పరిచి రిమాండ్ కు తరలించినట్లు చిన్న చౌక్ సీఐ ఓబులేసు, ఎస్ఐ ఎన్. రాజరాజేశ్వర్ రెడ్డి తెలిపారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

కడప నగరంలోని తాలూకా పోలీస్‌స్టేషన్ పరిధిలో శేఖర్ అనే వ్యక్తిపై మధు, చరణ్ అనే వారు దాడి చేశారు. ఈ కేసులో ఇరువురు నిందితులను శనివారం అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలియజేశారు.

బాలిక అదృశ్యం

కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న మైనర్‌బాలిక (17) అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలియజేశారు.

నేడు బహుమతులు ప్రదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాసోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేయనున్నట్లు కడప ఇస్లామిక్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ ఎఫ్ఎం ముక్తార్ అహ్మద్ తెలిపారు. నగర శివార్లలోని సబ్ జైల్ దగ్గర ఉన్న సైనిక్ నగర్ లో ఉన్న మదరసా ఉస్మాన్ బిన్ అఫ్వాన్‌లో విశ్వ కారుణ్య మూర్తి ప్రవక్త మొహమ్మద్ (సల్లెల్లాహు అలైహి వసల్లం) వారి జీవిత చరిత్ర పై రాత పరీక్ష పోటీలో పాల్గొన్న విజేతలకు, విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేయర్ ముంతాజ్ బేగంతో పాటు పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఏసీ నాయకులు

ఎర్రగుంట్ల : యర్రగుంట్ల మండల పరిధిలోని ఆర్టీపీపీలో ఈ నెల 15 నుంచి చేపడుతున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ జేఏసీ నాయకులు కోరారు. శనివారం సమ్మెకు సబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల, కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కరించేందుకు జెన్‌కో యజమాన్యం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ ఉద్యోగులు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాలతో కలసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమ్మెతో రాష్ట్రంలోని రైతులకు సాగు, తాగునీరు సరఫరాకు విద్యుత్ ఉత్పత్తి పంపిణీలో అంతరాయం ఏర్పడుతుందని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని జేఏసీ నేతలు స్పష్టం చేశారు.

తీరు మారకపోతే మూల్యం చెల్లించుకోక తప్పదు

ఉపాధ్యాయ సంఘాల హెచ్చరిక



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కూటమి ప్రభుత్వ తీరు మారకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు సయ్యద్ ఇక్బాల్, ప్రవీణ్ కిరణ్ హెచ్చరించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పోరుబాట కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఫ్యాప్టో చేపట్టిన నిరసన ర్యాలీ శనివారం సాయంత్రం మహావీర్ సర్కిల్, కలెక్టరేట్ సర్కిల్ మీదుగా డీఈఓ కార్యాలయం వరకు నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఎన్నికలకు ముందు ఒకలా, ఎన్నికల తర్వాత మరొకలా పాలకులు వ్యవహరిస్తున్నారని వారు దుయ్యబట్టారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, తాము అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షపాతిగా ఉంటామని, ఉద్యోగుల అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగులకు మెరుగైన వేతనాలను అమలు చేస్తామని, ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను ఆరు నెలల లోగా చెల్లిస్తామని పేర్కొన్నారన్నారు. కూటమి పెద్దల హామీలు నిజమని నమ్మి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి ఉద్యోగ, ఉపాధ్యాయులు సహకరిస్తే, ఉద్యోగ, ఉపాధ్యాయుల అండదండలతో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఉద్యోగులను పూర్తిగా విస్మరించిందన్నారు. పీఆర్సీ గడువు ముగిసి రెండేళ్లయినా ఆ ఊసే లేదన్నారు. ప్రభుత్వాలు డీఏ లు చెల్లించకపోతే ఉద్యోగులు ఎలా జీవిస్తారని ప్రతిపక్ష హోదాలో అప్పటి ప్రభుత్వాన్ని నిలదీసిన ఇప్పటి పాలకులు నాలుగు డీఏలను చెల్లించకుండా కాలయాపన చేస్తున్నారన్నారని విమర్శించారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా డీఏలను పెంచకపోతే ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎలా జీవనాన్ని సాగించాలో కూటమి పెద్దలే సమాధానం చెప్పాలని నిలదీశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలన్నింటినీ ఆరు మాసాల లోగా చెల్లిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన కూటమి ప్రభుత్వం కేవలం 7500 కోట్ల రూపాయలను మాత్రమే చెల్లించి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన 30 వేల కోట్ల రూపాయల బకాయిలపై స్పష్టత లేదన్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగుల గ్రాట్యుటీ, కమ్యుటేషన్, మెడికల్ రీయంబర్స్‌మెంట్లు సైతం చెల్లింపులకు నోచుకోవడం లేదన్నారు. కరోనా మహమ్మారితో మరణించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల కుటుంబాలకు కారుణ్య నియామకాలను సైతం చేపట్టడం లేదంటే ఉద్యోగుల కుటుంబాల పట్ల ఈ ప్రభుత్వానికి ఉన్న మానవీయత ఏ పాటిదో అర్థం చేసుకోవచ్చన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తామన్న కూటమి పెద్దలు, ఇచ్చిన హామీని పూర్తిగా మర్చిపోయినట్లున్నారని ఎద్దేవా చేశారు. ఫ్యాప్టో కడప జిల్లా చైర్మన్ ఇలియాస్‌బాషా, సెక్రటరీ జనరల్ రాళ్ళపల్లి అబ్దుల్లా, యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు, ఏపీటీఎఫ్ 257 జిల్లా అధ్యక్షులు ఖాదర్ భాషా మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ధ్యేయంగా పాలన సాగిస్తామని ప్రగల్భాలు పలికిన పాలకులు, ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులను నిరంతరం బోధనేతర కార్యక్రమాలలో భాగస్వాములను చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులను విద్యకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఒకవైపు ప్రభుత్వ విద్యారంగం పట్ల ప్రేమ కనపరుస్తున్నట్లు కనబడుతూనే మరో ప్రక్క ప్రభుత్వ విద్యను పాతాళానికి తొక్కేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరించకపోతే పోరాటం తీవ్రతరం కాక తప్పదని అందుకు ప్రభుత్వమే మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని ఈసందర్భంగా హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం స్పందించకపోతే అక్టోబర్ 7వ తేదీ చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టి భారీ ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ నాయకులు బాలగంగి రెడ్డి, నరసింహారావు, చెన్నకేశవరెడ్డి, సాజిద్, గంగన్న, గాజులపల్లి గోపీనాథ్, బత్తుల చంద్రశేఖర్, నరసింహులు, శ్రీనివాసులు, ప్రకాష్ బాబు, కరిముల్లా, పద్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ హయాంలోనే సుపరిపాలన

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు సత్య సాయినాథ్



కమలాపురం : రాష్ట్రంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి హయాంలోనే సుపరిపాలన అందిందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కాశీభట్ల సత్య సాయినాథ్ శర్మ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వస్తోందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. రెడ్ బుక్‌కు దీటుగా డిజిటల్ బుక్ పని చేస్తుందన్నారు. డిజిటల్ బుక్ ద్వారా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకర్తలకు అండగా ఉంటారని పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డికి, పార్లమెంటు సభ్యులు అవినాష్ రెడ్డికి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన



కడప నగరంలో వాహనదారులకు కౌన్సెలింగ్ చేస్తున్న పోలీసు అధికారులు, సిబ్బంది

కడప అర్బన్ : జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఉత్తర్వుల మేరకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఈ కార్యక్రమాలు జరిగాయి. పోలీస్ అధికారులు మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా వాహనదారులకు పలు ముఖ్యమైన సూచనలు చేశారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, అలా చేస్తే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాలను కాపాడుతుందని వివరించారు. వేగంగా, అతిగా లోడ్ చేసి వాహనాలు నడపడం ప్రమాదకరమని, దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం అత్యంత ప్రమాదకరమని, డ్రంకెన్ డ్రైవ్‌పై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు భద్రతపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణాలు చేయాలని పోలీసులు కోరారు.

7 నుంచి అథ్లెటిక్ పోటీలు

జమ్మలమడుగు : మండల స్థాయి అథ్లెటిక్ పోటీలను ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభిస్తామని పీఆర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాయురాలు శశికళ తెలిపారు. శనివారం మండల పరిధిలోని పీఈటీలతో పీఆర్ ఉన్నత పాఠశాలల్లో అథ్లెటిక్‌పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మంగళవారం 7న కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, 8వ తేదీ అథ్లెటిక్స్, 9వ తేదిన యోగా, బ్యాడ్మింటన్, చెస్ పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు 6వ తేది సాయంత్రం లోపు ఎంట్రీ ఫారాలను పీఆర్ ఉన్నతపాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మురళీ, మండల కోఆర్డినేటర్‌కు ఇవ్వవాలని సూచించారు. గెలుపొందిన క్రీడాకారులు డివిజన్ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీడీలు మురళీ, ఎర్రన్న, ప్రసాద్‌రెడ్డి, ఆమూదా బి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వర్గం చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్మిక వర్గం చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయమూర్తి సి.యామిని ఆదేశాల మేరకు శనివారం కడప నగర శివార్లలోని కొప్పర్తి పారిశ్రామికవాడలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి బాబా ఫకృద్దీన్ మాట్లాడుతూ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులు తమ హక్కుల గురించి తెలుసుకుని ఉండాలన్నారు. అనంతరం ఆయన కార్మికులకు ఈపీఎఫ్, ఈఎస్ఐ తదితర అంశాలపై అవగాహన కలిగించారు. అలాగే ఎంప్లాయిస్ కాంపెన్సేషన్ యాక్ట్, ఎంప్లాయిస్ ఇన్సూరెన్స్ కంపెనీ యాక్ట్, ఆర్టికల్ 14, 19, 21, 31, సమాన పనికి సమాన వేతనం, మెటర్నిటీ బెనిఫిట్ యాక్ట్, దిశ ఆక్ట్, ఉచిత న్యాయ సహాయం, లీగల్ ఎయిడ్, డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, క్యాస్ట్, ఇన్‌కమ్, సదరన్ సర్టిఫికెట్లు, పీసీ అండ్ పీఎన్‌డీటీ చట్టం, బాల్య వివాహాలు, నల్సా పథకాలు, మధ్యవర్తిత్వం గురించి తెలియజేశారు. ప్రజలు ఎలాంటి న్యాయ సహాయం అవసరమైనా ఉచిత సహాయక ఫోన్ నంబర్ 15100, సీనియర్ సిటిజన్స్ హెల్ప్ లైన్ నెంబర్ 14567, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ చాంద్‌బాష, ఇండస్ట్రియల్ జోనల్ మేనేజర్ శ్రీనివాసమూర్తి, చింతకొమ్మదిన్నె సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మద్దిలేటి, ఇండస్ట్రియల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్‌పై చర్యలు తీసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : జిల్లాలో దసరా పండుగ సీజన్‌లో ప్రజల వద్ద నుండి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యంపై రవాణా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పండుగ సీజన్‌లో విచ్చలవిడిగా బస్సు టికెట్లను అధిక మొత్తంలో ప్రజల వద్ద నుండి వసూలు చేశారన్నారు.

ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని డిమాండ్ పట్టి బస్సు టికెట్లను పెంచుకుంటూ పోతున్నా జిల్లాలో రవాణా శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కడప, ప్రొద్దుటూరు రవాణా శాఖ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా స్పందన లేదన్నారు. బహిరంగంగా ఆన్‌లైన్‌లో ఛార్జీలు రూ. 2 వేలు, ఆ పైన చూపిస్తున్నా చర్యలు శూన్యం అన్నారు. ముఖ్యంగా రెగ్యులర్ ఆర్టీఓ లేకపోవడంతో తనిఖీలు, చర్యలలో జాప్యం జరుగుతున్నదన్నారు. ప్రభుత్వం జిల్లా రెగ్యులర్ ఆర్టీవో ను నియమించాలని అన్నారు. జిల్లాలో హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు, విజయవాడ, విశాఖపట్నంకు ప్రైవేటు బస్సుల సర్వీసులు నడుస్తున్నాయని, ఇద్దరు డ్రైవర్లు ఉండాలని కానీ సింగిల్ డ్రైవర్లను రూటు సర్వీసులకు తిప్పుతూ డ్రైవర్లు పైన ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు నిర్వహించి అధిక మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తూ ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా నడుస్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్‌ఎస్‌ఎస్ సేవా కార్యక్రమాలు ప్రశంసనీయం

సింహాద్రిపురం : దేశ సంస్కృతి, సంప్రదాయాలను సంరక్షిస్తూ ప్రతిరంగంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రిటైర్డు ఆర్మీ వెంకట మహేశ్వరరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రమైన సింహాద్రిపురంలోని జున్ను నారాయణరెడ్డి మిల్లులో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ హిందూ ధర్మం కోసం – దేశం కోసం పనిచేసే హిందువులను కలపడం కోసం ప్రతి గ్రామం – ప్రతి బస్తీలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ విభాగ్ కార్యకారిణి కత్తి రామచంద్రారెడ్డి, మల్లికార్జునరెడ్డి, లక్ష్మిరెడ్డి, రాజశేఖరరెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణం



మాచుపల్లి బస్టాండులో ఆందోళన నిర్వహిస్తున్న జై భీమ్ మాల మహాసేన నాయకులు

కడప కార్పొరేషన్ : చిత్తూరు జిల్లా వెదురు కుప్పం మండలం దేవలం పేటలో భారత రత్న డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడం దారుణమని జై భీమ్ మాల మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు పి. సంపత్ కుమార్, ప్రధాన కార్యదర్శి చైతన్య అన్నారు. శనివారం మాచుపల్లి బస్టాండులో అంబేడ్కర్ చిత్రపటం పట్టుకొని వారు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ ఒక కులానికి, ఒక మతానికి చెందిన వారు కాదని, భారత రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కులు కల్పించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. నిప్పు పెట్టిన దుండగులను వెంటనే అరెస్ట్ చేయకపోతే జై భీమ్ మాల మహాసేన ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు బి. లారెన్స్, కార్యదర్శి వసంత్, శ్యాంసన్, నాగార్జున పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సమాయత్తం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అవ్వారు మల్లికార్జున

కడప సెవెన్‌రోడ్స్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నామని జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షులు అవ్వారు మల్లికార్జున తెలిపారు. శనివారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అన్ని నియోజకవర్గాల్లో కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 7న కమలాపురం, 8న బద్వేలు, 9న మైదుకూరు, 10న ప్రొద్దుటూరు, 11న జమ్మలమడుగు, 12న పులివెందుల, 13న కడపలో ఈ సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీసీ యునైటెడ్ నేషనల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేశుయాదవ్, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ నాయకులు నాగేశ్వరరావు, మల్లయ్య, బీసీ గంగులు, ఎస్వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

సింహాద్రిపురం : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కళాశాల ప్రిన్సిపాల్ శివశంకర్ తెలిపారు. శనివారం స్థానిక ప్రభుత్వ పాల్‌టెక్నిక్ కళాశాల ప్రాంగణంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వివిధ జాతులకు చెందిన సుమారు 120 మొక్కలను నాటి నీరు పోశారు. పచ్చని ఆరోగ్యకరమైన వాతావరణాన్ని పెంపొందించడంలో విద్యార్థులు, సిబ్బంది భాగస్వామ్యం కావాలన్నారు.

ఘనంగా దస్తగిరి స్వామి జెండా పండుగ

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణంలో దస్తగిరి స్వామి జెండా పండుగను భక్తులు శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పురవీధుల గుండా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దర్గాల వద్ద భక్తులకు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దర్గాలను విద్యుత్ దీపాల కాంతులతో ముస్తాబు చేశారు. కుల మాతాలకు అతీతంగా అందరూ తరలివచ్చి మొక్కుబడులు చెల్లించుకొని ప్రార్థనలు చేశారు. ఐదు రోజులుగా దర్గాల వద్ద దస్తగిరి స్వామి పుస్తక పఠనం చేస్తున్నారు.


విద్యుత్ ఉద్యోగుల రెండో దశ ఉద్యమం

సమ్మె నోటీసు అందజేసిన జేఏసీ నాయకులు

కడప కార్పొరేషన్ : విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు రెండో దశ ఉద్యమానికి సిద్ధమవుతున్నారు.

శనివారం విద్యుత్ భవన్‌లో ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్ఈ రమణకు జిల్లా విద్యుత్ జేఏసీ నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ విశాఖపట్నం కార్పొరేషన్ ఆఫీసు దగ్గర ధర్నా నిర్వహించనున్నామని, 8వ తేదీ తిరుపతి కార్పొరేషన్ ఆఫీసు వద్ద ధర్నా, 13వ తేదీ ఛలో విజయవాడ, 14వ తేదీ వర్క్ టు రూల్ పాటిస్తామన్నారు. అప్పటికీ విద్యుత్ యాజమాన్యం తమ సమస్యలకు సానుకూల పరిష్కారం చూపకపోతే 15వ తేదీ తర్వాత ఏ క్షణమైనా మెరుపు సమ్మెకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జేఏసీ చైర్మెన్ బార్నబాస్, కన్వీనర్ ఎంవీ చలపతి, జేఏసీ నాయకులు బ్రహ్మానందరెడ్డి, ఫయాజ్ భేగ్, యాకోబు, రమేష్‌రెడ్డి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న సీఐ విశ్వనాథ్‌రెడ్డి

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని చిలంకూరు గ్రామంలో సైబర్ నేరాలపై అవగాహనలో భాగంగా శనివారం రాత్రి మెలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాల వల్ల జరిగే నష్టాలు, రోడ్డు ప్రమాదాలపై కళాజాత బృందం ప్రదర్శన రూపంలో అవగాహన కల్పించారు. అనంతరం సీఐ విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాలు బాగా పెరిగాయని, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. వాట్సప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరాల్లో విద్యావంతులే అధికంగా మోసపోతుండడం బాధాకరమన్నారు. మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఇతర ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల బలహీనతలే సైబర్ నేరగాళ్లకు బలంగా మారిందన్నారు. మారుతున్న టెక్నాలజీతో మోసగాళ్లు చెలరేగిపోతున్నారన్నారు. అప్రమత్తంగా ఉంటేనే నష్టం జరగదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ నాగమురళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

• నిరుపయోగం



రామాంజనేయపురం వద్ద..



పాతబస్టాండు వద్ద..

శాంతిభద్రతల పరిరక్షణకు, ఈవ్ టీజింగ్‌ను అరికట్టేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కడప నగరంలో వివిధ చోట్ల ఏర్పాటు చేసిన పోలీస్ సబ్ కంట్రోల్ ఆఫీసులు శిథిలావస్థకు చేరుకున్నాయి. డోర్లు, కిటికీలు ఊడిపోయి, అద్దాలు పగిలిపోయి పాడుబడిపోయాయి. రిమ్స్ హాస్పిటల్, పాతబస్టాండు, రామాంజనేయపురం తదితర చోట్ల ఇలాంటి సబ్ కంట్రోల్ ఆఫీసులు ఉన్నాయి. పోలీసులు వీటిని ఉపయోగించకపోవడంతో నిరుపయోగంగా మారాయి. వేలాదిరూపాయలు వెచ్చించి నిర్మించిన వీటిని పోలీసులు ఉపయోగించని పక్షంలో, ప్రత్యామ్నాయంగా ఇతర సేవలకైనా వినియోగించాలని పలువురు కోరుతున్నారు.

ఫోటోలు : సాక్షి ఫోటోగ్రాఫర్, కడప

జమ్మలమడుగు మున్సిపాలిటీలో ఇక 25 వార్డులు



జమ్మలమడుగు మున్సిపల్ కార్యాలయం

జమ్మలమడుగు : ప్రభుత్వ ఆదేశాల మేరకు జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో వార్డుల పునర్విభజన కార్యక్రమాన్ని మున్సిపల్ అధికారులు పూర్తిచేశారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు మున్సిపాలిటీ పరిధిలో 20 నుంచి 25కు వార్డుల సంఖ్య పెంచారు. మేజర్ గ్రామ పంచాయతీగా ఉన్న జమ్మలమడుగు 2005లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నగర పంచాయతీగా మార్చారు. మొదటిసారిగా 20 వార్డులను విభజించారు. ప్రతి వార్డుకు 1,700 నుంచి 2,000 వరకు ఓటర్ల సంఖ్యను నిర్ణయించారు. అప్పటి నుంచి 2025 వరకు కొనసాగించారు. ప్రస్తుతం నగర పంచాయతీని అప్‌గ్రేడ్ కావడంతో మున్సిపల్ కౌన్సిల్ సభ్యుల సంఖ్య 20 నుంచి 25కు పెంచుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గెజిట్ విడుదల చేశారు.

అభ్యంతరాలు తెలపాలి

మున్సిపల్ వార్డులు పెంచుతూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రజలు తమ అభ్యంతరాలతోపాటు సూచనలు, సలహాలు సోమవారం సాయంత్రంలోపు మున్సిపల్ కార్యాలయంలో రాతపూర్వకంగా సమర్పించాలని కమిషనర్ వెంకటరామిరెడ్డి కోరారు. ప్రజల సూచనలు పరిగణలోనికి తీసుకుంటారని తెలిపారు.

సోమవారం కౌన్సిల్ సమావేశం!

మున్సిపల్ వార్డుల పెంపుపై సోమవారం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించబోతున్నట్లు సమాచారం. అధికారులు ఈ కౌన్సిల్ సమావేశంలో గెజిట్ ప్రవేశపెట్టి కౌన్సిల్ సభ్యులను పెంచుతూ తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 25 మంది అభ్యర్థులు జమ్మలమడుగు మున్సిపల్ కౌన్సిల్‌కు పోటీ పడనున్నారు.